ఒకప్పుడు పురుషోత్తం రెడ్డి జర్నలిస్టుగాను, రాజప్ప కార్మిక నాయకుడిగాను, ఖైరుద్దీన్ అన్సారీ పుస్తకాల షాపు యజమానిగాను, బుచ్చిరాజు ఎమ్మెస్సీ చదువుతూను, ఛమేలీ ముఖర్జీ ఇంగ్లీషు లెక్చరర్ గానూ వుంటుండేవారు. కానీ వాళ్ళు సామాజిక వ్యతిరేక కార్యకలాపాలు చేసినందుకు, సంఘవ్యతిరేక శక్తులతో కలసి పని చేస్తున్నందుకు సంఘ భద్రతకు ఆటంకం కలుగచేసినందుకు 'రాజద్రోహం' చేసినందుకు వాళ్ళని పోలీసులు అరెస్టు చేశారు. జైల్లో పడేశారు. విచారణ లేదు. వాళ్ళ విడుదల ఎప్పుడో వాళ్ళకే తెలియదు.

గోడలు ఎత్తుగా వున్నాయి. ఎత్తుగావున్న గోడలమీద ఇనుప తీగెలు పేనున్నాయి అక్కడక్కడ పెద్ద పెద్ద 'ఫ్లడ్ లైట్లున్నాయి ఆ గోడ దాదాపు అరమైలు పొడవుంది. ఆ గోడకు ఆ చివరన ఒక ఇనుపగేటుంది. ఆ ఇనుప గేటుకి అవతల గోడపక్కన ఒక సెక్యూరిటీ గది వుంది అక్కడ ఒక సెంట్రీ నిలబడి వున్నాడు అతని చేతిలో తళతళ మెరిసే కత్తి చివరగల తుపాకీవుంది. అతని నెత్తిమీద సిమెంటు రంగులోనున్న ఇనుప టోపీ వుంది. అతను మడతలు నలగని ఖాకీ దుస్తులు వేసుకుని దర్జాగా, హుందాగా. పెద్ద పెద్ద మీసాల్తో భీకరంగా వున్నాడు

అతని కుడిపక్కగా విశాలమైన మట్టిబాట ఫర్లాంగు దూరం వ్యాపించి వుంది. ఆ రోడ్డుకి ఇరువైపులా తురాయిచెట్లు పూలు పూసి ఎర్రెర్రగా మెరుస్తున్నాయి. ఆ చెట్లకి మధ్య మధ్యన రకరకాలుగా పెంచిన క్రోటన్సు మొక్కలు అందంగా ఉన్నాయి. ఆ చివర గోడపక్కన వరసగా యెక్కువగా మామిడి చెట్లు, తక్కువగా అరటి చెట్లు. కుంకుడు చెట్లు. బొప్పాయి చెట్లు వున్నాయి. మిగతా ఖాళీ ప్రదేశమంతా రకరకాలైన పూలమొక్కల్తోనూ. కూరగాయల మొక్కల్తోనూ నిండిపోయి వున్నది.

తర్వాత విశాలమైన వరండా. ఆ వరండా ఆనుకుని అర డజను ఆఫీసు గదులు. ఆ గదులు దాటాక మళ్ళీ వరండా. కొన్ని గదులు...అవి దాటి ముందుకెళ్తే ఖాళీజాగా. ఆ తర్వాత మగఖైదీల గదులు. గదులబైట చిన్న వరండా. పెచ్చులూడిపోయిన స్తంభాలు. వరసగా పాతిక గదులు దాటాక మలుపు అక్కడ పట్టపగలే చీకటి. ఆ చీకటి బాటకి ఎడంవేపున కిందకి మెట్లు. ఆ మెట్లు దిగి పక్కకు వెళ్తే తక్కువ ప్రదేశంలో కట్టిన ఎక్కువ ఖైదీల గదులు. అవి ఆడ ఖైదీల గదులు .... అవే కాక అక్కడక్కడ విడివిడిగా కట్టిన ప్రత్యేకమైన గదులు కూడా వున్నాయి. ఆడ ఖైదీలకు, మగ ఖైదీలకు విడివిడిగా ఎవరి గదుల చివర వారికీ పదేసి పాయిఖానాలున్నాయి.

రాత్రి తొమ్మిది గంటలు. అప్పుడే ఖైదీల భోజనాలయాయి. ఖైదీలు ఎవరి గదుల్లోకి వాళ్ళెళ్ళిపోయాక వార్డర్ వచ్చి అన్ని గదులకీ తాళాలు వేసి వెళ్ళిపోయాడు. హెడ్ వార్డర్ ఒకసారి అన్ని గదులూ 'విజిట్' చేసి వెళ్ళిపోయాడు. అక్కడ ఎక్కువ గదుల్లో బల్బులు లేకపోవడంవలన తక్కువ గదుల్లో లైట్లు వెలుగుతున్నాయి.

ఆ సమయంలో ఆ చివరనుంచి ఐదవ గదిలో లైటు వెలుగుతోంది. ఆ లైటు వెలిగినా దాని కాంతి మాత్రం అస్పష్టంగానూ.




# జయ జయ జయహో!

దాట్ల నారాయణమూర్తిరాజు

మసక మసగ్గానూ వుంది. ఆ బల్బు కాంతి వరండాలో నేలమీద సగంవరకూ పడి తేమగా వున్న నేలమీద అద్దుకుపోతోంది.

ఆ గది బైట నిలబడితే అక్కడ మాసిన బట్టల వాసన, ముక్కిపోయిన పళ్ళ వాసన కలిపి వేస్తున్నట్టుగా వుంటుంది. ఆ గదిలో ఒక మూల రెండు చిన్న మట్టి పాత్రలు. ఇంకో మూల నీళ్ళతో నున్న కుండ వున్నాయి. కటకటాలకు ఎదురుగా వున్న సిమెంటు చపటామీద ఒక వ్యక్తి పడుకుని వున్నాడు. అతని కళ్ళకు పెద్ద పెద్ద భూతద్దాల కళ్ళద్దాలున్నాయి. అతని తల వత్తుగా, మీసాలు చిన్నగా వున్నాయి. అతని జుత్తు నెరిసిపోయి వుంది. అతను గుండెల మీద చేతులు పెట్టుకుని పైకప్పువేపు చూస్తూ ఆలోచిస్తున్నాడు. అతని చేతిలో 'ఫాలోమీ' అన్న పుస్తకం వుంది.


ఆ మూల కుండపక్క ముడుకుల్లో తల పెట్టుకుని కూర్చొని ఇంకో వ్యక్తి వున్నాడు. అతను సన్నగా రివటలా వున్నాడు. అతని జుత్తు బాగా పెరగడం వలన అది అతని భుజాలు దాటి వుంది. మీసాలు పెరిగి పెదిమలమీద వెంట్రుకలు పడుతున్నాయి. అతని బుర్రను ముణుకుల మీద ఆన్చి కూర్చోవడం వలన జుత్తు, పొడవాటి కాళ్ళు మాత్రమే కనబడుతున్నాయి. అతని పక్కన సగం వరకూ మడతపెట్టిన 'అంబాసిడర్ ఆఫ్ గుడ్‌విల్' అన్న పుస్తకం వుంది.

అతనికి కొంచెం దూరంలో గోడకి చేరబడి, కాళ్ళు చాపుకుని రెండు చేతుల్నీ ఇంటూ మార్కులా గుండెమీద వేసుకుని కళ్ళు మూసుకున్నాడు. అతని ముక్కు పొడవుగా వుంది. అతని నుదురు వెడల్పుగా వుంది. చిన్నగా పెరిగిన గెడ్డం, గెడ్డంతో కలిసిపోయిన 'సైడ్‌లాక్స్', మీసాలు. అతను ఎర్రగా వున్నాడు. గుండెలమీద వున్న పుస్తకమ్మీద అక్షరాల్ని అతని చేతులు కప్పెయ్యడం వలన అవి కనబడటం లేదు.

నేలమీద పరచిన దుప్పటి ముక్క నేల చెమ్మలో అదీ కలిసిపోయింది. దానిమీద అడ్డంగా పడుకున్నాడాయన. అతను తలకింద రెండుచేతులూ పెట్టుకుని మసిబారిన బల్బువేపు చూస్తున్నాడు. పైనంతా వంటగదిలా వుంది.

వాళ్ళు నలుగురూ పురుషోత్తం రెడ్డి, రాజప్ప, ఖైరుద్దీన్ అన్సారీ, బుచ్చిరాజులు.

ఆఫీసు రూంలోని గడియారం పదకొండు గంటలు కొట్టింది. అప్పుడు అక్కడ నిశ్శబ్దం పేదరికంలా భయంకరంగా, ఒంటరితనంలా అసహ్యంగా వుంది. అప్పుడక్కడ లైట్లన్నీ ఆరిపోయాయి. అప్పుడప్పుడు వార్డర్లు వూళలు వూదుతూ సిగరెట్లు కాలుస్తూ, అలసిపోయినపుడు ముచ్చట్లాడుకుంటున్నారు.



మహాకవి గురజాడ అప్పారావు పంతులుగారు

ముప్పండం సన్యాసిచెట్టి (మూగచెముడుచిత్రకారుడు, విజయనగరం)

ఆ సమయంలో అక్కడ గజ్జికుక్కపిల్ల మూలుగులా ఓ మూలుగు రాన్రానూ ఎక్కువైపోతోంది. అది మూలుగులా ప్రారంభమై, ఏడుపులా రూపుదాల్చి ఆఖరికి అది భయంకరమైన బాధలా, ఆ బాధకు వేసే అరుపులా వినబడుతోంది.

“ఏంవిటీ అరుపు” ఆడవాళ్ళ గదుల చివర వరండామీద తలాన్చి పడుకున్న “మేటిన్” లేచి ఆకారంలాగానే భీకరంగా అరిచింది. అరిచి, లేచి, వచ్చి ఈ చివరి గదిలోకి తొంగి చూసింది. ఆ గదిలో లైటు లేదు కానీ, ఆ గది వెనక ఎత్తైన ప్రహరీ గోడ మీది 'ఫ్లడ్‌లైటు' కాంతి ఆ గదిలోకి సగం పడుతోంది. ఆ గదిలో ఏం జరుగుతున్నదో ఆడవాళ్ళను కాపలా కాసే ఆ ఆడఖైదీకి తెలీటంలేదు.

“ఏంవిటే.... ఏంవిటే.... అక్కడ.... ఒసేయ్.... చంపా....”

పలుకు లేదు.

అక్కడ మూలుగులు భయంకరంగా వున్నాయి. “అమ్మా.... అబ్బా” అరుపులు రాన్రానూ ఎక్కువై ఆ గదుల నిండా కాంతి నిండిపోయింది.

“ఏంవమ్మోయ్.... కొత్త ఖైదీ.... ఏంవమ్మోయ్” నెంబరు పెట్టి పిలిచింది. నిద్రలో నున్న ఛమేలీ గబుక్కున లేచింది.

“ఏంవిటి” గాభరాగా అడిగింది. అప్పటికే అక్కడ మూలుగులు, అరుపులు ఎక్కువగా వున్నాయి.

“లైటు వెయ్యి” గాభరాగా అరిచింది మేటిన్.

“లోన లైటు లేదని తెలీదా నీకు....” తోటి ఆడఖైదీ చంపవేపు చూస్తూ అన్నాది ఛమేలీ.

“నువ్వే.. వరండాలో లైటు వెయ్యి...” మళ్ళీ ఛమేలీయే అన్నాది.

మేటిన్ గాభరాగా వరండామీద లైటు వేసింది. వెల్తురు సర్రున త్రాచుపాములా పాకి ఆ గదిలోకి వచ్చింది. ఒకపక్క చంప కడుపు చేతితో పట్టుకుని ఏడుస్తోంది.

మేటిన్ గబగబా వరండా దాటి, చీకటి బాట పక్కనుంచి మగఖైదీల గదుల దగ్గర గోడ వద్ద కొచ్చి “వార్డర్ బాబూ....” అని అక్కడ డ్యూటీలో వున్న కావలా జవానుని పిలిచింది.

“ఏంవిటి.”

వార్డర్ అక్కడికి వెళ్ళబోయి, విషయం విని తాళాలు మేటిన్ కిచ్చేడు. “డాక్టరుకి ఒక్కసారి [illegible]చెయ్యి” అన్నాది మేటిన్.

“అఖ్ఖర్లేదులే.... కడుపు నొప్పయితే.... అదే తగ్గిపోద్దిలే .... అర్ధరాత్రి ఆ డాక్టర్ని లేపితే అసలే గొడవ....అసలు ఆ డాక్టరు అర్ధరాత్రిన ఇంట్లో వుండడు....” అని అన్నాడు.

మేటిన్ తలుపు తీసింది. వార్డర్ దగ్గర బేట్రీలైటు తీసుకుని లోనికెళ్ళి వేసింది. అప్పటికే ఛమేలీ చంప రెండు చేతులూ పట్టుకుంది.

“ఏంవిటేంవిటి....”

“నొప్పులు....డాక్టర్ని పిలు....”

“డాక్టరు బాబు లేట్ట..వార్డర్ చెప్పాడు... అయినా,...ఏ నెళ్ళకే....” ఇంకేదో అన్నాది మేటిన్.

చంప చాలా సేపు గింజుకుని ఒక బిడ్డని కన్నాది. ఆ బిడ్డకు నేల మీద పడిన [illegible] నిమిషాలకు నూకలు చెల్లిపోయాయి. బిడ్డ చచ్చిపోయేడని చంపకి తెలీదు. కానీ ఛమేలీ తనకేమాత్రం సంబంధం, పరిచయంలేని ఆ మరో ఖైదీ చంపకి రాత్రంతా సేవ చేస్తూనే వుంది.

ఛమేలీ పొడుగ్గా వుంటుంది. వంటి రంగు పసుపు పచ్చగా వుంటుంది. ఆవిడ పెద్దపెద్ద కళ్ళ చుట్టూ బోలెడు ఆశలున్నాయి. ఆవిడకు, తనకు నచ్చింది చెయ్యడం చిన్నప్పట్నించీ అలవాటు చేసుకుంది. ఆ అలవాటులో చెడుని ద్వేషించడం, మంచిని ప్రేమించడం సహజంగా చోటు చేసుకున్నాయి.

* * *

పురుషోత్తంకి ఆ రోజు సెలవు రోజు. అంచేత తన ఇంట్లోనే వున్నాడు. అప్పుడే భార్య వచ్చి కాఫీ గ్లాసు చేతిలో పెట్టి

వెళ్ళింది. కాఫీ తాగుతూ. సిగరెట్ తీసి వెలిగించాడు.

ఆ సమయంలో ఒక ముసలాయన "బాబూ పురుషోత్తం బాబు ఇల్లిదేనా" అని వచ్చారు. ఆయనకు దాదాపు ఏభై ఏళ్ళుంటాయి. భుజమ్మీద కండువాతో చెమట నుదుట్ని తుడుచుకుంటూ ఈ విధంగా అన్నాడు:

"మీ ఆఫీసుకెళ్ళాను బాబూ. మీరు లేరు. ఇల్లు కానుకోడం మా పెద్ద ఇబ్బందై పోయింది" కూర్చుంటూ "నీకో విషయం చెప్పాలి బాబూ. మాకు నీ ద్వారానే న్యాయం జరుగుద్దని నమ్ముతున్నాను" అని ఉపక్రమించేడు.

"చెప్పండి...."

"నా పేరు రామస్వామి. మాది మాల పేట. దానికే ఇపుడు ప్రియదర్శినీ నగర్ అని పేరు మార్చేరనుకో. ఆ మాలపేటలో ఒక వందిళ్ళుంటాయి. అయ్యి ఈనాటివి గాదు బాబూ, తాతల్నాటినుంచీ వస్తున్నవే.. మా సొంతిల్లులే అని మేం అనుకుంటున్నవే. కానీ ఆ మద్దెన మీకిళ్ళు కట్టిస్తాం అని చెప్పి దొరోరు ఆ ఇళ్ళు ఖాళీ సేయింపించేరు.... మేం పక్కా ఇళ్ళొస్తాయని పూరపాకలకి పోనాం. ఆరెల్లయింది, సంవత్సరమైంది. ఇళ్ళూ లేవు. పాకిల్లూ లేవు. ఆ మద్దెన వారం కిందట మా భూవులమీద పెద్ద హొటేలు కడ్తున్నట్టుగా విన్నాం.

ఆ కంట్రాక్టరు బాబు దగ్గరకెళ్ళాం. ఏం అని బాబు.... ఏంటీ మాయ.... అని అడిగేం....గవర్నమెంటోళ్ళు ఆ భూమి తన కిచ్చేరని.... చెప్పాడు. కలక్టేరు బాబుతో కల్సి మనివి చేసుకున్నాం. సూస్తానన్నాడు.. కానీ ఈ లోపల ఆ కంట్రాక్టరు..పునాదులు లేపేస్తున్నాడు ఎలాగ. మా కార్పొరేటర్ బాబు దగ్గర కెళ్తే అదిగో. ఇదిగో అంటన్నాడు. ఎమ్ఎల్యే బాబు దగ్గరకెళ్తే.. పక్కా ఇళ్ళొస్తాయికదా.. పక్కా ఇళ్ళొస్తాయి..అనే అంటున్నాడు ఈ విషయం.. మీకు సెబుదామని.. అది బాబు కత.. మీ పేపర్లో ఏయిద్దూ...."

అలాగేనని పురుషోత్తం రామస్వామి చెప్పిన వివరాలను రాసుకుని ఆయన్ని పంపించేశాడు. ఆ వార్తను మర్నాటి పత్రికలో ప్రచురించేడు.

అప్పుడు అసలు గొడవ మొదలైంది. ఆ కంట్రాక్టరు వెనక ఎన్నెన్ని శక్తులున్నాయో అన్ని శక్తులూ పురుషోత్తంమీద పడ్డాయి... పలుకుబడిచేత... డబ్బుచేత... ఆడవాళ్ళచేత.... ఇతన్ని లొంగదీసుకోడానికి చూసేరు. కానీ పురుషోత్తం వాటికి తావివ్వలేదు. ఆ మాలపేటలోని వాళ్ళకి జరిగిన అన్యాయాలమీద. ప్రభుత్వం విధానమ్మీద. లంచగొండి అధికారులమీద. వివరాలు విపులంగా సేకరించి వ్యాసాలు రాసేడు. కానీ ఒకరోజు అకస్మాత్తుగా ఒక సబిన్స్‌పెక్టరు, ముగ్గురు కానిస్టేబిల్సు వచ్చి అతనిని అరెస్టు చేస్తున్నామని చెప్పేరు.




విజయవాడలో ఇటీవల "క్రీస్తు ఆరాధన" రికార్డు విడుదల సందర్భంగా ప్రసంగిస్తున్న మిమిక్రీ కళాకారుడు సిల్వ స్టార్. (ఎడమనుంచి) శ్రీయుతులు బి. ప్రభుదాసు. తుర్లపాటి కుటుంబరావు, సంపత్. ఫాదర్ నోయర్ హార్పర్. ఫాదర్ జోజి, హెచ్. ఎం. వి. మంగపతిలను చూడవచ్చు

"ఎందుకు....ఏంటి ?"

ఆ ప్రశ్నలకు సమాధానం యివ్వాల్సిన అవసరం పోలీసువాళ్ళకి లేదట. వాళ్ళు తెచ్చిన వారెంటు వెనుక యెందరి హస్తాలున్నాయో అత నూహించుకో గలిగేడు. కానీ పురుషోత్తం జంకకుండా పోలీసులతో వెళ్ళాడు. అక్కణ్ణించి వాళ్ళు మేజిస్ట్రేట్ ముందుకి తీసుకెళ్ళారు. అక్కణ్ణుంచి జైలుకి తీసుకువెళ్ళారు. పదిహేను రోజులైంది. నెల రోజులు గడిచాయి. రెండు నెలలు. కారణంలేని కారాగారం.

సరిగ్గా అదే సమయంలో పురుషోత్తం వచ్చినట్లుగానే వచ్చేడు బుచ్చిరాజు. బుచ్చిరాజు కష్టపడి యూనివర్సిటీ చదువు వరకూ వచ్చేడు. అతను కష్టం విలువను అనుభవం ద్వారా తెలుసుకున్నాడు. అతను యూనివర్సిటీలో వుండే ఒక విద్యార్థి యూనియన్ని చాలా చైతన్యవంతంగా నడిపేవాడు. ఎక్కడైనా ఏ విద్యార్థికైనా అన్యాయం జరిగితే అక్కడ తోటి సోదరులతో ప్రత్యక్షమై, జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడేవాడు. స్వార్థంలేని నిర్భయం, పుస్తకాలు చదివి ఏర్పుచుకున్న స్వచ్ఛమయిన అభిప్రాయాలు అతన్ని విలువైన వ్యక్తిగా నిలబెట్టేయి. దానికి ఫలితం- అతను అరెస్టు చేయబడ్డాడు. తప్పుడు కేసులతో మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చి "రిమాండ్"లోకి పంపేరు. రాజప్ప అంతే. ఖైరుద్దీన్ అన్సారీ అంతే. ఛమేలీ ముఖర్జీ అంతే.

న్యాయ చట్టంలో నిర్దిష్టమైన విధానం వుంది. కానీ న్యాయాన్ని అమలుజరిపే అధికారులకు ఆ విషయం అక్కర్లేదు. వాళ్ళని జైల్లో పడేశాక అధికారులు వీళ్ళ విషయం సహజంగా అలక్ష్యం చేశారు. వీళ్ళవాళ్ళు ఎన్ని ఉత్తరాలు రాసినా వీళ్ళకి ఆ ఉత్తరాలు అందలేదు. ఏంటౌతుందో తెలీదు. వీళ్ళ గురించి పట్టించుకునేవాడు లేడు.

* * *

మర్నాడు మామూలుగా తెల్లవారింది.


పది గంటలౌతుంది.

అన్సారీ మర్రిచెట్టు కింద కూర్చున్నాడు. ఇంతల్లో ఒక పారిశుద్ధ్య కార్మికునిచేత ఒక వార్డర్ ఎర్రటి గుడ్డలు.వాటిమీద కప్పబడిన తెల్లటి గుడ్డలతో నిండివున్న గంపని పట్టించుకుని వెళుతున్నాడు.

ఆ వార్డర్ అట్నుంచిటు వస్తున్నపుడు "ఏంటవి" అడిగేడు అన్సారీ.

"ఏంలేదు. రాత్రి ఓ ఆడఖైదీ ప్రసవించింది. పురుట్లోనే కునికిసేడు గుంటడు. పారేసేం" అన్నాడు.

"పారేసేరా....." ఆశ్చర్యపోయాడు అన్సారీ. అతనికొక్కసారి తన భార్య జ్ఞాపకాని కొచ్చింది.




ముంతాజ్.

ముంతాజ్.

ఆ రోజు తనగదిలో కూర్చుని ఎకౌంట్స్ చూసుకుంటున్నాడు. అంతల్లో తలుపు చప్పుడైంది. భార్య వెళ్ళి తలుపు తీసింది. పరసగా వరసగా ఏడుగురు పోలీసులు.. గబగబా ఇంట్లోకి వచ్చేరు.. అడ్డదిడ్డంగా సామాన్లన్నీ విసిరేశారు.. 'ఏంవిటని' అడుగబోయాడు తను. అడగనివ్వలేదు. లాఠీల్తో బాదేరు. అడ్డుగా వచ్చింది భార్య. ఒక పోలీసు తన బూటుతో ఆమె పొట్టమీద తన్నేడు.

ముంతాజ్ గర్భవతి.

తన ఎదురుగానే తన భార్య విలవిల్లాడింది. కానీ తను కదలడానికి వీల్లేకపోయింది. తన గుండెలమీద పోలీసు బూట్లు. తనని కదలనీయకండా పోలీసుల ఉక్కుచేతులు. తనని బరబరా లాక్కుని బైటకు తీసుకువచ్చేరు.. ఆప్పుడు గదిలోకి తను చూశాడు.

గది మధ్యలో పడిపోయిన ముంతాజ్. చిదిగిపోయిన గర్భం. లంగా, చీర తడిసిపోయి నేలమీద చారికలు కట్టిన రక్తం.... రక్తం....

ముంతాజ్ జ్ఞాపకానికి రాగానే అన్సారీ వొక్కసారి అయోమయంగా అయిపోయాడు. పిచ్చిగా జుత్తు పీక్కున్నాడు. గట్టిగా అరిచేడు. ఆ అరుపుకి పురుషోత్తం, రాజప్ప, బుచ్చిరాజు, మరికొంతమంది ఖైదీలు అతని చుట్టూ చేరారు.

"ఈ పోలీసు బద్మాష్‌ని బ్రతకనివ్వ కూడదు....వీళ్ళు....తల్లికి మొగుళ్ళు.... పుండాకోర్లు....దయా దాక్షిణ్యం.... మమకారం....లేని రాక్షసులు- వెధవలు...." గట్టిగా తిట్టి ఇంతల్లో అటుగా కర్రూపుకుని వస్తున్న ఒక కాపలాజవాన్ని పట్టుకుని వాడి టోపీ విసిరేసి, వాడి లాఠీకర్ర లాక్కుని, వాణ్ణి ఛాకొక్కపుచ్చుకు లాగి, విసిరికొట్టి, నేలమీద పడ్డవాణ్ణి లేపి చితకతన్నేడు అన్సారీ.

అన్సారీని ఆపబోయారు మిగతా ఖైదీలు. కానీ అన్సారీ ముఖంలో కోపానికి కారణం వాళ్ళకు తెలీలేదు. అన్సారీ ముఖం పీర్ల గుండంలా వుంది. అతని కళ్ళు గుండంలోని నిప్పుకణికల్లా వున్నాయి. గబుక్కున మిగతా పోలీసులు వచ్చారు. గబగబా వాళ్ళు లాఠీలందుకున్నారు. రాళ్ళందుకున్నారు. దొరికిన ఖైదీల్ని మంచీ చెడ్డా చూడకండా విచక్షణా రహితంగా కొట్టేరు. వాళ్ళు కొట్టిన దెబ్బలకు చాలా మందికి ముడుకులు విరిగిపోయినట్టయ్యాయి. అక్కడ మనుషులు, మనుషులు దెబ్బలాడుకుంటున్నట్లు గాక అడవిలోని జంతువులు ఆకలితో మనుషుల్ని ఏకీలు కాకీలు పీకి తింటున్నట్టుగా వుంది.

ఒక అరగంట గడిచింది.

ఆ వాతావరణం చల్లబడింది. అక్కడక్కడ మర్రిచెట్టు చపటా అంచున, క్రోటన్సు కుండీల మీద, వరండా స్తంభాలకు అంటుకుని నెత్తురు మరకలు.. జరిగిందానికి గుర్తులుగా నిలిచాయి.

పురుషోత్తం, రాజప్ప, అన్సారీ, బుచ్చిరాజుల్ని లాక్కొచ్చి గదిలో పడేశారు. మిగతా ఖైదీల్ని గదుల్లోపెట్టి తాళం వేశారు.

"ఎందుకలా తొందరపడ్డావు" రాజప్ప అడిగేడు అన్సారీని. అన్సారీ మాట్లాడలేదు. గది కిటికీలోంచి కనబడే పిడికెడు ఆకాశాన్నీ ఆప్యాయంగా చూస్తున్నాడు. అతని శరీరం, అలసిపోయినా అతని మనసు ప్రశాంతంగా వుంది. అతని కళ్లు కోపంతో ఎరుపెక్కినా, కనుపాపల్లో మాత్రం చిరువెలుగు చల్లగా వుంది. అలా నీలపు ఆకాశాన్ని చూస్తున్న అతనికి కిటికీ చువ్వల మీద రెండు పిచికలు కనిపించాయి. వాటిని చూస్తుంటే ఎందుకో సరదా వేసింది. వెంటనే ఆనందంగా చప్పట్లు కొట్టాడు. అతని వేపు ఆశ్చర్యంగా చూశారు మిగతా ముగ్గురు.

సరిగ్గా ఆ సమయంలో వచ్చేడు జైలు అధికారుల్లో ఒకడు. అతడు పెద్ద అధికారి కంటే చిన్నవాడైనా ఖైదీల్ని 'ఖైదీలుగానే' చూడడంలో నేర్పరిగా చిన్న వయసులోనే ప్రశంసింపబడ్డాడు. దానికి కొన్ని గౌరవాలు కూడా పొందేడు. ఆ కుర్ర డిప్యూటీ సూపరింటెండెంట్ పొడవుగా వుంటాడు. అతని చూపులు నిశితంగా వుంటాయి. అతని కళ్ళెప్పుడూ ఎర్రగా వుంటాయి. అతను ఎర్రగా ఏపిల్ పండులా వుంటాడు. అతని చేతిలో ఎప్పుడూ లాఠీకర్ర వుంటుంది. అతనెపుడూ 'రోత్‌మెన్స్' ఇంపోర్టెట్ సిగరెట్లు కాల్చడంలో ఆనందాన్ని ప్రకటిస్తాడు. అతనికి 'జిన్' అంటే ఇష్టం. ఆడవాళ్ళన్నా కూడా ఇష్టమే. అతనికి ఆడవాళ్ళలో మొగుడున్న ఆడవాళ్ళతో గడపడం అంటే ఇష్టం. మరి కాలేజీ అమ్మాయిల్తో పడుకోవడమంటే సరదా. ఇలాగ అతనికి చాలా ఇష్టాలు, ఇష్టంలేకపోడాలు వున్నాయి. ఇష్టం లేకపోవడంలో కొన్నున్నాయి. అవి తన మీద ఎవరైనా ఎదురు తిరగడం.

అంచేత అలాంటి డిప్యూటీ సూపరింటెండెంట్‌కి జైలులో ఈ గొడవ తెల్సి 'విజిట్' చెయ్యడానికి బైల్దేరాడు. అయన వెనకాతల జైలు డాక్టరు, సీనియర్ జైలర్, డిప్యూటీ జైలర్, చీఫ్ హెడ్‌వార్డర్, హెడ్ వార్డర్, కొంత మంది సెంట్రీలున్నారు.

ఐదో గదిముందు ఆగేడు.

"తలుపు తెరు" వార్డర్ని ఆజ్ఞాపించేడు. వార్డర్ వినయంగా తలుపు తెరిచి, ఇటు తిరిగి భక్తితో "సెల్యూట్" చేశాడు.

"ఇందులో ఎంతమంది వుంటున్నారు."

డ్యూటీలో వున్న హెడ్ వార్డర్ జవాబు చెప్పాడు.

పురుషోత్తం, రాజప్ప, బుచ్చిరాజు, అన్సారీలను నలుగురు కాపలా జవాన్లు బైటకు తీసుకొచ్చారు.

"వీళ్ళ పొగరు నాకు తెల్సు..." అన్నట్లుగా వాళ్ళవేపు కళ్ళు చిట్లించుకుని ఒకసారి చూసి "వాళ్ళ ముగ్గుర్నీ సెల్లో పడేయండి....వీణ్ణి నాతో తీసుకురండి..." అని ఆజ్ఞాపించేడాయన. ఆ ఆజ్ఞను అమలుజరిపి ఖైరుద్దీన్ అన్సారీని ఆయన వెనుక తీసుకెళ్ళారు.

ఖైదీ గదులు దాటాక వరండాకి కొంచెం దూరంలో ఒక ఆఫీసు రూం వుంది. అందులో గుమస్తా వుంటాడు. ఆ గుమస్తా ఈయన్ని చూసి గాభరాతో లేచి గబుక్కున "సెల్యూట్" కొట్టాడు.

ఆ గదిలో ఒక టేబిల్ వుంది. ఆ టేబిల్‌కి ఆనుకుని ఒక కుర్చీ వుంది. ఆ మూల ఏవో ఆయిలు డబ్బాలున్నాయి. ఇంకోపక్క

కర్రలున్నాయి. ఇంకోపక్క కొన్ని పలుగులు. పార లున్నాయి. తలుపుల్లేని బీరువాలో కొన్ని పాతపుస్తకా లున్నాయి.

అన్సారీని ఆ గదిలోకి తీసుకునివచ్చి జవానులు బైటకెళ్ళిపోయారు. అన్సారీ ఒక్కసారి ఆ ఆఫీసరు వేపు చూశాడు. ఆ చూపులు ఆ ఆఫీసరు చూసేడు.

"నా హయాంలో నా సెంట్రీమీద చెయ్యి చేసుకోడానికి నీకెన్నిగుండెల్రా లండీకే.."

అన్సారీ మాట్లాడ లేదు.

"నిన్నిప్పుడు తంతే.... నీకెవడురా దిక్కు.... నిన్ను చంపి.. ఇక్కడ పాతి పెట్టేసినా ఎవడూ అడగడు.... తెల్సా.... ఆఖరికి.... నీ అల్లా కూడా...."

అన్సారీ మాట్లాడలేదు.

"ఓరి.... ఎర్రినా కొడక... మంత్రాలు చదువుతున్నావేంట్రా.... లేక పొగరా.." ఆ అధికారి చేతిలోని లాఠీ విసురుగా లేచింది.

అన్సారీ అడ్డుకున్నాడు.

"బోసడీకే.... కుత్తే.... సువ్వర్...." ఆవేశంగా తిట్టేడు అన్సారీ.

ఆ అధికారి విసురుగా కుర్చీమీద ఎడం కాలుని కిందపెట్టి, కుడికాలుని పైకెత్తి అన్సారీ రెండు తొడల మధ్యన తన్నేడు.

అన్సారీ చెయ్యి అడ్డుకోబోయాడు. కానీ అతని కాలి బూట్ల ఇనుప మేకులు అన్సారీ చేతికి దిగబడిపోయి అతని చేతిలోంచి రక్తం చివ్వుమని పైకొచ్చింది. ఆ రక్తం ఆ అధికారి ముఖమ్మీదకు తుళ్ళింది. మళ్ళీ రెండోసారి తన్నబోయాడు. అన్సారీ చెయ్యడ్డుకుని అతని లాఠీ కర్ర లాక్కుని ఆ ఆఫీసర్ని కొట్టేడు. ఆ దెబ్బకి ఆ కుర్ర ఆఫీసరు విసురుగా గదిలో ఒక మూల పడిపోయి, వెంటనే లేచి చేతికి దొరికిన కర్రపేడుతో కొట్టాడు. కొంతసేపుపోయాక అలిసిపోయాడు. కానీ తిరగబడటానికి అన్సారీ చేతినుంచి విపరీతంగా చిమ్ముకొస్తున్న రక్తం, సలుపుతున్న తొడ మధ్య భాగం వలన అతడు ఆ ఆఫీసరు కొట్టిన దెబ్బల్ని భరించాడు.

అన్సారీ వీపంతా రక్తమయమైపోయింది. అతను అరచి సొమ్మసిల్లి పడిపోయాడు. వెంటనే ఆ ఆఫీసరు గదిబైట కొచ్చాడు. డాక్టరు లోనకెళ్ళి 'ఏం పర్వాలేదు' అన్నట్టుగా తణిఖీ చేసిచూసాడు. "వీణ్ణి ఆలైట్రిన్ల తర్వాత వున్న గదిలో పడేయండి" కేకేసినట్టుగా చెప్పి వెళ్ళిపోయాడు ఆ అధికారి. అతని వెనకాతల అతని మందీ మార్బలం వెళ్ళిపోయారు. చాలాసేపు ఆ దూరం గదినుంచి బాధతో అరుపులు వినబడి అటు తర్వాత అక్కడ నిశ్శబ్దం ఆక్రమించింది.

"రాత్రి ఆడవాళ్ళ గదుల్లోంచి కేకలు వినబడ్డాయి. ఒకావిడ చాలా బాధతో ఏడ్చింది. ఇంకో ఆవిడ ఆవిణ్ణి ఓదారుస్తూ ఏడుస్తోంది. అపుడు...." ఆగిపోయాడు రాజప్ప. పురుషోత్తం రాజప్ప వేపుచూసి, రాజప్ప చూస్తున్నవేపు కళ్ళద్దాలు సర్దుకుని చూశాడు.

ఒక నిచ్చెన మీద ఒక శవాన్ని తీసుకుని వెళ్తున్నారు. ఆ వెనక ఒకావిడ స్తంభం వరకూ వచ్చి నిలబడి ఆ శవం వెళ్తున్న వేపు చూస్తోంది.

శవం తతంగమంతా అయిపోయాక అధికారులందరూ లోనికి వస్తున్నప్పుడు రాజప్ప అంటున్న మాటలు కుర్ర అధికారి విన్నాడు.

"ఈ డాక్టరు నా కొడుకు...ఏంవీ పట్టించుకోని సూపరెంటెంట్...ఖైదీల్ని బాధపెట్టడం తప్ప ఖైదీలు పడ్డ బాధలు అక్కర్లేని ఈ జైలు అధికారుల నిర్లక్ష్యం వల్లే ఆవిడ చనిపోయింది. పాపం. ఈ పది రోజులు ఆ పక్క ఖైదీ చూసినంత ఆ మేట్రిగాని, వీళ్ళుగాని చూడలేదు. వీళ్ళని అడిగేవాడు ఎవడూ లేడు ఇవాళ ఆవిడ. రేపు మనం" ఆవేశంతోను,ఉక్రోషంతోను అంటున్నాడు రాజప్ప. ఆ చుట్టూ చేరిన ఖైదీలు వింటున్నారు.

గబుక్కున పెద్ద పెద్ద అంగలు వేసుకుని వచ్చేడు ఆ అధికారి. ఆయన్ని చూసి ఖైదీలందరూ నాలుగు వేపులా వెళ్ళిపోయారు. కానీ రాజప్ప కదల్లేదు. సూటిగా ఆ అధికారి కళ్ళవేపు చూశాడు. ఆయన రాజప్ప చూపుల వేపు చూశాడు.

"ఇది నీ యూనియన్ కాదు.... తెల్సా...." అని అన్నాడాయన.

"తెల్సు...."

"అయితే .... ఇక్కడ నువ్వు ఉపన్యాసం ఇవ్వడానిక్కాదు వచ్చింది...."

"నాకు తెల్సు...."

చురుగ్గా కనుబొమ్మలు పైకెత్తి ఆ ఆఫీసరు రాజప్పవేపు చూశాడు.

"ఒళ్ళు జాగ్రత్త.. వెళ్ళు నీ సెల్‌లోకి.. వెధవ్వేషాలెయ్యక...." వెనక్కి తిరిగి వెళ్ళిపోతున్నవాడు రాజప్ప తిట్టు విని ఆగిపోయాడు.

"ఏంట్రా.... అన్నావ్...."

"కొజ్జా లంజాకొడుకు.. అని" తన తిట్టుని మళ్ళీ అన్నాడు రాజప్ప.

రాజప్ప వూహించలేదు. ఒక్కసారి ఆ అధికారి పైకెగిరి తన్నేడు. ఆ తాపునకు రాజప్ప అంత దూరం వెళ్ళి మర్రి చెట్టు దగ్గర పడిపోయాడు. మర్రిచెట్టు చపటా రాజప్ప తలకి గట్టిగా గుద్దుకుంది.


బుర్ర గిర్రుమంది. కదల్లేకపోయాడు.

ఆ సమయంలో ఆ ఆఫీసరు గబగబా వచ్చి రాజప్ప చొక్కాని పట్టుకుని బరబరా లాక్కుని ఆఫీసు వరండా దగ్గరకు తీసుకుని వెళ్ళాడు. అక్కడ లాఠీ విరిగిపోయినట్టుగా కొట్టింపించి దాన్ని చూస్తూ ఆనందించి "వెధవ్వేషాలెయ్యక....తెల్సిందా... నీలాగే వేషాలేసిన నీ దోస్త్ ఏంవయ్యాడో చూశావుకదా...." అని అన్నాడు.

"ఇప్పుడు కాదు..ఇవాళ కాదు....నిన్నూ నీలాంటివాళ్ళని సమూలంగా నాశనంచేసే కొత్తతరం వస్తుంది. ఈ అన్యాయం.... ఈ అక్రమం....ఈ దురాగ్గం ఎన్నాళ్ళో సాగదు....అది మాత్రం తెల్సుకో...." అంత నీరసంలోను రాజప్ప కార్మిక ఉత్తేజం అతనిచేత అనిపించింది.

"వస్తుందిరా.... వస్తుంది.... కొత్త తరం.... మా అక్రమాలు.... అన్యాయాలు.... అన్నీ పోతాయి.... అప్పుడు నిన్ను పిలుస్తారు...." ఆ ఆఫీసరు ఒక వెకిలి నవ్వు నవ్వి-

"నిన్నిలాక్కాదు...." అని పక్కనున్న కాపలా జవానుని పిల్చి పూలమొక్కల



ఫెన్సింగ్ వెనకాతల రాజప్పను వెల్లకిలా పడుకోబెట్టాడు.

ఇంతల్లో ఇంకో వార్డర్ని పిలిచి వాడి చెవిలో ఏదో చెప్పాడు. వాడు ఆశ్చర్యంగా చూసి, అతని చూపులకు దుకిసి బాత్‌రూం వేపు వెళ్ళాడు.

ఆ వార్డర్ అయిదు నిమిషాల్లో చేతిలో చిన్నడబ్బాతో వచ్చేడు. ఆ డబ్బాను ఆ ఆఫీసరుకి ఇవ్వబోయాడు ఆ ఆఫీసరు ఆ వార్డర్ వేపు కోపంగా చూసి, "నువ్వే చెయ్" అన్నట్టుగా కళ్ళతోనే గదమాయించేడు.

నలుగురు జవాన్లు రాజప్పను నాలుగు వేపులా పట్టుకున్నారు. రాజప్ప గింజుకున్నాడు. ఆ అధికారి రాజప్ప గుండెలమీద కుడికాలు వేసి నిలబడ్డాడు.

ఇంతల్లో మొట్టమొదట డబ్బా పట్టుకున్న వాడివేపు ఆ అధికారి చూడగానే వాడు వెంటనే రాజప్ప నోటిని తెరచి, ఆ నోట్లో వాడి మూత్రాన్ని పోశాడు. రాజప్ప తపుక్కున ఉమ్మేశాడు. మళ్ళీ పోశాడు. మళ్ళీ ఉమ్మేశాడు. మళ్ళీ పోశాడు. ఈసారి ఆ జైలధికారి తన కాలిబూటును గుండెమీంచి తీసి రాజప్ప నోటిమీద అడ్డంగా వుంచి నొక్కేడు.

రాజప్ప విలవిల్లాడేడు.

* * *

ఆ రోజు కాలేజీ ప్రిన్సిపాల్ చేస్తున్న ఘాతుకం ఛమేలీ కళ్ళారా చూసింది. ఇంటర్ అమ్మాయిని తన గదికి మామూలుగా పిలిచి, తలుపులు వేసేసి నీచంగా ప్రవర్తించబోయాడు. అది తను చూసింది పోలీసులకు ఫోన్ చేసింది. ఆ తర్వాత ప్రిన్సిపాల్ రిజైన్ చెయ్యాలని విద్యార్థులచేత స్ట్రైక్ చేయించింది. కానీ ఎక్కడో లోపం వలన సమ్మె సగంలోనే ఆగిపోయింది. తను అరెస్టు అయింది. తనకు తెలీకుండా తన చుట్టూ వలయాలు.... ఆ వలయాలు విషవలయాలని తెల్సుకోవడం ఎంతోసేపు పట్టలేదు.

* * *

ఒకరోజు చీఫ్ హెడ్‌వార్డర్ విజిట్ కొచ్చి అందరినీ చూశాడు. ఆడవాళ్ళ గదులను ప్రత్యేకంగా తణికీ చేశాడు. అందులో తొమ్మిదో గదిలో వుండే అమ్మాయి వేపు కళ్ళు చిట్లించి చూసి వార్డర్ చేత తాళం తీయింపించి బయటకి పిల్చాడు.

"నీ పేరేం పేరు" అని అడిగాడు.

"కళ్యాణి...." అమాయకంగా జవాబు చెప్పింది.

"రాత్రికి వచ్చీ" అన్నాడు. ఆ అమ్మాయికి మొట్టమొదట ఏం అర్థం కాలేదు. అర్థమైన తర్వాత "ఛీ" అని ఆ అమ్మాయి తుపుక్కున వాడి ముఖాన ఉమ్మేసి తిట్టింది.

"నీలాంటి దంచేనే నా కిష్టం...." అని గబుక్కున అందరి ఖైదీల ముందర అతని రసికత్వం బైటపెట్టాడు. సిగ్గు లేకుండా ఎడం కుచమ్మీద చెయ్యివేసి.

ఆ అమ్మాయి రాత్రి వరకూ తిడుతూనే వుంది. సరిగ్గా పదకొండు గంటలౌతుంది. మేట్రిన్ వచ్చి ఆ గది తలుపు తీస్తోంది.

"తలుపు తీశావా తన్నేస్తాను." ఆ అమ్మాయి పౌరుషంగా అంటోంది.

ఇంతల్లోకి ఇద్దరు వార్డర్లు వచ్చి కళ్యాణి చెరోరెక్క పుచ్చుకుని బయటకు లాక్కెడుతున్నారు. ఆ అమ్మాయి కేకలేస్తోంది.

"అమ్మా, అమ్మా రక్షించండి. బాబూ రక్షించడి. లక్ష్మి, మోతీ, సుశీలా, ఛమేలీ అక్కా అక్కా."

గబుక్కున ఆ కేకలకు ఛమేలీకి మెలకువ వచ్చింది. అప్పటికే గొడవ గొడవగా వుంది. పరిస్థితి అర్థమైంది. ఒక్కసారి గట్టిగా అరుస్తూ అంది.

"అందరికీ వినబడేటట్లు గట్టిగా అరవండి.... ప్లీజ్.... అందరూ అరవండి..." ఆవిడ ఉద్రేకాన్ని గ్రహించిన ఆడ ఖైదీలందరూ నోరు చించుకు అరిచేరు.

ఆ అరుపులకు మగ ఖైదీలు వరసగా మేల్కొన్నారు.

కళ్యాణిని లాక్కెళుతూ ఆడ ఖైదీల గదులకు, మగఖైదీల గదులకు మధ్యనున్న చీకటి వరండా దగ్గర ఆగిపోయారు. చీకట్లో కళ్ళు చిట్లించుకుని చూసేరు వార్డర్లు.

ఖైరుద్దీన్, అన్సారీ, రాజప్ప, బుచ్చిరాజు, పురుషోత్తం, మరికొంతమంది ఖైదీలు-

ఆ ఇద్దరు వార్డర్లు ఖైరుద్దీన్ చేతిలో కైమా అయిపోయారు. ఆ గొడవకు మిగతా సెంట్రీలు రణస్థలానికి వచ్చేరు. వాళ్ళూ పచ్చడి ఐపోయారు. చాలా మంది....చాలా మంది.... చాలా మంది ఖైదీలు.... మగ ఖైదీలు ఎలా వచ్చేసేరో తెలీదు. తాళాలు ఫడేల్‌ఫడేల్మని పేలిపోయాయి. దొరికిన జవానుని వీళ్ళు వొదిలిపెట్టలేదు. దొరికిన ఖైదీని వాళ్ళు వదిలిపెట్టలేదు.

గదిలో సింగారించుకుని కూర్చున్న చీఫ్ హెడ్‌వార్డర్ వార్త విని గబుక్కున వచ్చేడు. గాలిలో తుపాకీలు పేల్చి పరిస్థితిని అదుపులోకి తెచ్చాడు. కానీ అదుపులోకి వచ్చిన పరిస్థితి క్షణంలో అదుపుతప్పిపోయింది.

క్షణాలమీద ఆ వార్త డిప్యూటీ సూపరెన్టెంట్‌కి వెళ్ళింది. మిగతా అధికారులకి వెళ్ళింది. అప్పుడు డిప్యూటీ సూపరెన్టెంట్ ఇంట్లోనే వున్నాడు. ఆయన ఎదురుగా డాక్టరు కూడా వున్నాడు. వాళ్ళిద్దరి మధ్యన 'బ్లూ రిబెండ్' జిన్ ఫుల్‌బాటిలుంది. ఓ బాటిల్లో లెమనేడ్ కూడా వుంది. ఓ పక్క చికెన్ జాయింట్స్, ఇంకోపక్క 'రోత్‌మెన్స్' సిగరెట్ పేకెట్స్ వున్నాయి. ఆయన ఆ సమయంలో చాలా హుషారుగాను, ఆనందంగానూ వున్నారు. దానిక్కారణం మందు పూర్తయిన తర్వాత ముచ్చటగా నాలు గైదులు దాటని కాలేజీ అమ్మాయితో పడుకోబోతున్నారు. అందువలన వాళ్ళ మాటలు బూతులమీదే వున్నాయి. పెంట్‌హౌజ్‌లోని జోకులు, రెడ్‌స్క్వేర్‌లోని జోకులు వేసుకుంటున్నారు.

సరిగ్గా ఆ సమయంలో ఓ వార్డర్‌వచ్చి వార్త నందించేడు.

ఆయనకు వొక్కసారి మూడ్ పాడైపోయింది. నిషా దిగిపోయి కోపం పైకెక్కింది. టేబిల్ని ఒక్కసారి తన్నేశాడు. దానిమీద గ్లాసులు, సీసా మిగతా సరంజామా చిచ్చుబుడ్డిలా ఎగిరేయి.

గబుక్కున బైటకొచ్చి జీపెక్కి రెణ్ణిముషాల్లో సెంట్రల్ జైలు కొచ్చాడు. పెద్ద పెద్ద అడుగులేసుకుంటూ యుద్ధ ప్రదేశానికొచ్చాడు. అప్పటికే అక్కడ జైలర్లు, హెడ్ వార్డరు, మిగతా జైలుని పరిరక్షించే అధికార్లు వున్నారు.

"ఏమిటి, ఏమిటి జరిగింది." చీఫ్ హెడ్‌వార్డర్ జరిగింది బెరుకు బెరుగ్గా చెప్పాడు. వెంటనే ఆయన దవడ ఫడేల్మని పటాసులా పేలింది.

"వాళ్ళు సెల్లుల్లోంచి ఎలా బయట కొచ్చేరు. ఎలా?ఎలా?మీ సోమరి తనం. మీ బద్ధకం.తగువుని ముదిర్చిన వాళ్ళెవరు...." కోపంగా అడిగాడు.

హెడ్‌వార్డర్ పేర్లు చెప్పాడు.

"వాళ్ళని తీసుకురండి...."

మేట్రిన్ ఛమేలీని తీసుకొచ్చింది.మిగతా వాళ్ళు ఖైదీల్ని తీసుకొచ్చారు. వాళ్ళవేపు నిశితంగా చూసి—

"ఇక్కడ అన్యాయం జరిగిపోతోందా. దాన్ని మీరు సహించలేరా. లాభం లేదు. ఏదో చదూకున్నోళ్ళని మీకా మాత్రం గౌరవం ఇస్తున్నాను. తెల్సా.. జైలంటే మీకు భయంలేదు.. చట్టం అంటే మీకు గౌరవం లేదు. మీరెంత పెద్ద నాయకులైనా.. మేధావులైనా.. మీ కిక్కడేకాదు.. ఈ దేశంలోనే విలువలేదు... తెల్సా... అసలు మీలాంటి తిరుగుబాటుదార్లని అణిచెయ్యడానికే మాకు చట్టంలో ఇన్ని అధికారాలున్నాయి...మీరు సమాజాన్ని నాశనం చేస్తున్న నక్సలైట్లు.. మిమ్మల్ని బ్రతక

నివ్వగూడదు.. బ్రతకనివ్వగూడదు.."

ఛమేలీతోసహా ఐదుగురినీ విసురుగా చంపదెబ్బలు కొట్టేడు. అన్సారీ గెడ్డాన్ని ముందుకు లాగి ముక్కుమీద బలంగా కొట్టేడు. పురుషోత్తం పొట్టలో కొట్టాడు. రాజప్ప జెబ్బమీద లాఠీదెబ్బ కొట్టాడు. బుచ్చిరాజు జుత్తు పట్టుకుని ముందుకి లాగి వెనక్కి గోడవేపు విసిరి కొట్టాడు. ఛమేలీ జుత్తు పట్టుకుని వంచి వీపుమీద గుద్దులు గుద్దేడు.

అప్పుడు ఆ సమయంలో ఆ పోలీసు అధికారి పిచ్చి పట్టినవాడిలా వున్నాడు. కామ్ముల్లో కుమ్మేసినవాడిలా వున్నాడు. అతను తన జుట్టుని రెండు చేతులతో పీక్కుని నానారకాలుగా తిట్టి, అనేక రకాలుగా నానా అసహ్యంగా దుర్మార్గంగా ప్రవర్తించేడు. అతడిలో ఏమూలనా మనిషి పోలికల్లేవు. ఎదురు తిరిగినవాళ్ళని అడ్డంగా నరికెయ్యగలిగే పోలీసు అధికారిలాగే వున్నాడు.

"గెటౌట్.... ఆల్ అఫ్ యూ గెటౌట్.. టేక్ దెమ్ ఎ..వే. టేక్ దెమ్..ఎవే.." అతడు గట్టిగా అరిచేడు.

వార్డర్లు ముందు కొచ్చేరు.

అప్పుడు సమయంలో రాజప్ప ముందుకి కదిలేడు. దగ్గర కొచ్చిన ఒక వార్డరు చేతిలోని తుపాకీని లాక్కున్నాడు. వెంటనే ట్రిగ్గర్ నొక్కి ఆ తుపాకీని గాల్లో రెండు సార్లు పేల్చి అందరివేపూ చూస్తూ....

"రండ్రా.... రండ్రా.... నా కొడుకుల్లారా.... రండ్ర.... ఎవడేం చేస్తాడో.... రండి.... మేం మనుషులం కావూ.... పురుగులం కదూ. మంచి కోసం పాటుపడే ప్రతివాడూ నీలాంటి వెధవల దృష్టిలో నక్సలైట్. ప్రజల బ్రతుకుల్ని వాళ్ళకి గుర్తు చేసిన ప్రతివాడూ నీలాంటివాళ్ళ దృష్టిలో గెరిల్లాలే నువ్వు న్యాయాన్ని కాపాడేవాడివి. ముండల్తోనూ....మందుల్తోనూ.... తాప్పుళ్ళతోనూ, లంచాలతోనూ మీ జీవితం పుచ్చిపోయింది....కుళ్ళిపోయింది.... తోటి మనుషుల్ని చిత్రహింసలు పెట్టే మీరు న్యాయాన్ని రక్షిస్తారా. నెవర్.... ఒరేయ్, ఇవాళ నా చేతిలో నీ చావు మూడింది...." అని తుపాకీని ఆ జైలాఫీసరువేపు గురిచేసి పెట్టాడు.

అపుడా సమయంలో ఆ ఆఫీసరుకి కాళ్ళూ చేతులూ చల్లబడిపోయాయి. ఇలా జరుగుతుందని వూహించలేదు. మిగతా జైలు సిబ్బంది ఏంవీ తోచక నిలబడిపోయారు.

ఒకటి.

రెండు.

మూడు!




మూడు నిమిషాలు గడిదాయి. ఇంతట్లోకి ఎక్కణ్ణుంచొచ్చారో పదిమంది సెంట్రీలు పరిగెత్తుకొని వచ్చి తుపాకుల్ని గాల్లో పేల్చి, ఖైదీల వేపు గురిచేసి నిలబడ్డారు.

రాజప్ప ఆగిపోయేడు.

ట్రిగ్గర్ మీంచి అతని చెయ్యి వెనక్కి వెళ్ళింది. కానీ వెంటనే తుపాకీని అట్నించి వెనక్కి తిప్పి ఆ ఆఫీసరు కడుపులో పొడిచాడు. అడ్డదిడ్డంగా నిలబడిన ఆ చుట్టుపక్కల నున్న జైలు సిబ్బందిని ఆ తుపాకీ కర్రతో కొట్టేడు.

వాళ్ళలా తిరగబడ్డారు. అక్కడ డిప్యూటీ సూపర్నెంట్ సమక్షంలో లాఠీలు స్వేచ్ఛా విహారం. గాల్లో తుపాకీల పేలుళ్ళు. బాష్పవాయుప్రయోగం. కొంతమంది జవాన్లు.... ఎక్కువమంది ఖైదీలు గాయపడ్డారు.

గంటతర్వాత నిశ్శబ్దం మధ్య జైలు వల్లకాడులా వుంది. దెబ్బతగిలిన వాళ్ళకు డాక్టరు చికిత్సచేసి వెళ్ళాడు. తర్వాత జైలుని సూపరింటెంట్ విజిట్ చేసారు.

ఆ మర్నాడు ఒక ఏడుగురు పై అధికారులు వచ్చేరు. వాళ్ళు తమ తోడేళ్ళ చూపుల్తోను, కొండచిలువ కళ్ళతోను ఖైదీల్ని శల్య పరీక్షలు చేసాక, ప్రత్యేకంగా ఛమేలీ, రాజప్ప, ఖైరుద్దీన్ అన్సారీ, పురుషోత్తం, బుచ్చిరాజులను చూసి వెళ్ళి ఆఫీసు రూంలో సమావేశమయ్యారు. ఆ అధికారులతోపాటు జైలు సూపరెండెంట్, డిప్యూటీ సూపరెండెంట్, సీనియర్ జైలర్, డిప్యూటీ జైలర్, వార్డెన్లు, చీఫ్ హెడ్ వార్డర్, హెడ్ వార్డర్లు వున్నారు.

ఖైదీలకు జైలంటే భయంలేదు. జైలు అధికారులంటే గౌరవం లేదు. చట్టమంటే జడుపు లేదు. దానికి ఇలాంటివాళ్ళే కారణం. వాళ్ళని అణిచెయ్యాలి. మిగతా ఖైదీలు తిరగబడకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని" సూచించేరు.

ఆ రోజు మధ్యాహ్నం సూపరెండెంట్ మళ్ళీ ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి "జైల్లో క్రమశిక్షణమీద, అధికారుల విధులమీద అరగంట ఉపన్యశించి ఇలాంటివి ఇకముందు జరక్కుండా అప్రమత్తతతో ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలని" చెప్పారు.

మర్నాడు—

జైలులో వాతావరణం బాగుంది. ఖైదీలందరూ ఆనందంగా వున్నారు. దానిక్కారణం ఏ అధికారీ ఆరోజు వాళ్ళని చూడడానికి రాలేదు. మధ్యాహ్నం భోజనం అయ్యాక వాళ్ళు నలుగురూ రావిచెట్టు కింద కూర్చుని చాలాసేపు మాట్లాడుకున్నారు.

అప్పుడు అన్సారీ భార్యని తల్చుకుని బాధపడ్డాడు. పురుషోత్తం జీవితాన్ని తల్చుకుని బాధపడ్డాడు. రాజప్ప రోజురోజుకీ విషమిస్తున్న జైలు బ్రతుకు గూర్చి బాధపడ్డాడు. బుచ్చిరాజు వ్యవస్థని తల్చుకుని బాధపడ్డాడు.

ఒంటరిగా కూర్చున్న ఛమేలీకి వాళ్ళ నాన్న జ్ఞాపకానికి రాగా ఆ ఆలోచనల్తో బాధపడింది. వాళ్ళు చాలాసేపు బాధపడి చివరికి పరిష్కారంకాని జీవితానికి పరిష్కారాన్ని నిశ్చయించుకున్నారు

ఏంవిటి?

ఎలాగ?


కానీ—

ఆవేళ—

జైలులో వాతావరణం ప్రశాంతంగా వుంది. చెట్లు, చెట్ల గుబురుల్లోంచి తొంగి చూసే పువ్వులు చక్కగా పసిపిల్లల్లాగా వున్నాయి. ఆకులమీద పడ్డ కిరణాలు ఆ పిల్లల కళ్ళల్లోని లేత వెలుగుల్లాగా వున్నాయి.

రాత్రి—

ఎనిమిది గంటలకి భోజనాలయ్యాయి. ఆవేళ ప్రత్యేకంగా రాజప్పనీ, పురు




షోత్తంనీ ఒక గదిలోకి. అన్సారీ. బుచ్చిరాజుని ఒక గదిలోకి మార్చేరు.

పురుషోత్తం 'ఫాలో మీ' పుస్తకాన్ని చదవడం పూర్తిచేశాడు. రాజప్ప ఆరాత్రి స్వేచ్ఛగా గొంతెత్తి పాటలు పాడుకున్నాడు. అన్సారీ "అంబాసిడర్ ఆఫ్ గుడ్‌విల్" పూర్తి చేశాడు. బుచ్చిరాజు గోడ మీద మసిబొగ్గుతో ఏవో బొమ్మలేస్తూ కూర్చున్నాడు.

ఆ చివర ఆడ ఖైదీల గదుల్లో చివర గదిలో కూర్చున్న ఛమేలీ ఇనుప కటకటాల్లోంచి కనబడే నల్లటి ఆకాశాన్నీ, చుక్కల్నీ చూస్తూ కూర్చుంది.

చెట్లమీంచి వచ్చే గాలి మెల్లగానూ, మెత్తగానూ వుంది. ఆ మెత్తని గాలి నిద్రనీ మత్తుగా వంటిమీదకు తెస్తోంది. సరిగ్గా ఆ సమయంలో అక్కడ చీకటి చిక్కగావుంది. దూరంగా కోవెల్లో గంటలు ఎవరో మోగిస్తున్నారో. గాలికి వూగుతున్నాయో గాని. ఆ శబ్దం గాల్లో వూగుతూ జోగుతోంది.

సరిగ్గా అప్పుడు—

డిప్యూటి సూపరెండెంట్. సీనియర్ జైలర్. హెడ్ వార్డర్ మరికొంతమంది జైలు సిబ్బంది వచ్చి వరండామీద నిలబడ్డారు. డిప్యూటి సూపరెండెంట్ చూపులు ఆ చివర గదుల్లోకి వెళ్ళాయి.

"వెళ్ళండి...." ఆఫీసరు ఆజ్ఞాపించగానే నల్గుగురు వార్డర్లు చకచకా ఆ చివర గదుల దగ్గరకెళ్ళి తాళాలు తీశారు.

ఆ చప్పుడికి అక్కడ నిద్రపోతున్న ఖైదీలకు మెలుకువొచ్చింది.

'ఎవరు?'

దానికి సమాధానం లేదు.

వరండా మీద లైటు వెలిగింది.

ఆ సమయంలో ఆ జవానులెందుకు అక్కడకొచ్చారో అర్థం కాలేదు.

"బైటకి రండి" హెడ్‌వార్డర్ ఆజ్ఞతో వాళ్ళు నలుగురూ బైటకొచ్చారు.

"రండి."

వార్డర్ల వెనుక వాళ్ళు నలుగురూ వరండా వరకూ వచ్చారు. అక్కడ చీకట్లో నిలబడ్డ డిప్యూటి సూపరింటెంటు తుపాకి లాటున్న తోడేలులా వున్నాడు.

"వీళ్ళని కొట్టుగదికి తీసుకువెళ్ళండి" ఆజ్ఞాపించాడు.

"దాన్ని కూడా తీసుకురండి...." అధికారి మాటతో మేట్రిన్ గబగబా వెళ్ళి ఐదు నిమిషాల్లో ఛమేలీ ముఖర్జీని తీసుకు వచ్చింది.

కొట్టు గదిలో వాళ్ళు ఐదుగురూ ఓ కర్ర బల్లమీద కూర్చున్నారు. వాళ్ళ చేతులికి బేడీలు తగిలించేరు. అప్పుడా జైలు అధికారి "మీరు వెళ్ళండి...." అని వార్డర్లను పంపించేశాడు. హెడ్ వార్డర్ని మాత్రం వుండమన్నాడు. హెడ్ వార్డర్ చేతిలో బేటరీ లైటు వుంది. దాన్ని తన చేతిలోకి తీసుకుని ఆ జైలధికారి ఖైదీల వేపు "ఫోకస్" చేశాడు.

వాళ్ళు ఐదుగురికీ ఏమీ అర్థం కావడం లేదు. ఏమిటి జరుగుతోంది. ఏమిటి? తిరగబడకండా శిక్షిస్తారా.... లేకపోతే ఇంకో చోటికి పంపిస్తారా.... అయినా ఈ అర్ధరాత్రి....

వాళ్ళు నెమ్మదిగా ఒకళ్ళనొకళ్ళని అదే ప్రశ్నను వేసుకున్నారు. కాని ఆ ప్రశ్నకు సమాధానం ఎవరూ చెప్పలేక పోయారు.

రెండు నిమిషాలు గడిచాయి.

అంతవరకూ గది బైట నిలబడ్డ ఆ అధికారి గదిలోకి వచ్చాడు. ఒక్కొక్కరి ముఖమ్మీద బ్యాటరీలైటు వేశాడు. అప్పుడా ఐదుగురి మనసులో ఏ ఆలోచనా లేదు. కానీ వాళ్ళు ఐదుగురూ మనుషులు కాబట్టి మొదటిసారిగా జంకు పుట్టింది. అందుకు గుర్తుగా బ్యాటరీలైటు వెలుగులో చిరుచెమట మెరిసింది.

అప్పుడా జైలు అధికారి వాళ్ళనుద్దేశించి యిలా అన్నాడు :

"మీరు రోడ్డుమీద కొట్టుకున్నారనుకోండి.... నేను పట్టించుకోను .... లూటీలు చేశారనుకొండి. బ్లాక్ మెయిల్ చేశారనుకొండి.... స్మగ్లింగ్ చేశారనుకొండి. పోనీ యెవరైనా కిడ్నాప్‌చేసి ఎత్తుకు పోయారనుకోండి... రేప్‌చేశారనుకోండి.... వాటికి సరైన కారణాలుంటే.... నేను మిమ్మల్ని సానుభూతితో చూడగలను.... కానీ మీరు జవాన్లమీద తిరగబడినపుడు నే నూరుకున్నాను.... అల్లర్లను సృష్టించినపుడు మీ గురించి ఆలోచించాను.... కానీ మీకా్కని వ్యవహారంలో జోక్యం చేసుకున్నారు.... జైలు అధికారులమీద తిరగబడ్డారు అప్పుడు మీ రెవరో నా కర్థమైంది .... మిమ్మల్ని మనుషులుగా చూడకూడదని, జాలి, దయ, మీ విషయంలో పనికిరావని అర్థమైంది.

దీన్ని ఎవరూ క్షమించరు. ఈ చట్టం, ఈ న్యాయం ప్రజల్ని రక్షించడానికేర్పడ్డాయి. కానీ మీరు చట్టమ్మీద, న్యాయస్థానం మీద తిరగబడ్డారు. మార్పు తెచ్చుకుని మంచి మనుషులుగా వెళ్ళాల్సిన మీరు జైల్లో అలజడిని సృష్టించారు. అడుగడుగునా ఆటంకం. మేం ప్రజల జీవితాన్ని పరిరక్షించలేకపోవడానికి, సమాజంలో భద్రత లోపించడానికి మీలాంటివాళ్ళే కారణం.

మామూలుగా హాయిగా బతికే అలగా జనం మీ పాటలకు ఉత్తేజం పొంది, మీ మాటలు నిజమనినమ్మి, పోలీసులమీద తిరుగుబాటు చేస్తున్నారు. ఆలోచన లేని వాళ్ళకు ఆలోచన కల్గిస్తున్నారు....మీరు.... నాదృష్టిలోనిజంగామీరే ద్రోహులు, సంఘానికి చీడపురుగులు అలాంటి చీడపురుగుల్ని నేలరాసేందుకే ప్రభుత్వం మాకిన్ని అధికారాలిచ్చింది.

మీకు చట్టమంటే గౌరవంలేదు. అధికారులంటే లక్ష్యం లేదు. మీకు మేము ఈకముక్కతో సమానం. నిన్న మీవలన మా అధికారుల ముందర నేను తలవంచుకోవాల్సి వచ్చింది. దానిక్కారణం- ఇప్పటి వరకూ మిమ్మల్ని మర్యాదగా చూడ్డమే. ఆ మర్యాదను మీరు నిలబెట్టుకోలేదు.

పైగా మిమ్మల్ని విడుదల చెయ్యాలని బైటనుంచి మెమొరాండాలు, కరపత్రాలు. అన్నివేపులా ఒక పథకం ప్రకారం మీరు సృష్టిస్తున్న అలజడిని నేను ఎదుర్కోడానికి నిశ్చయించుకున్నాను. నేనంటే ఏమిటో మీకు చూపిస్తాను...."

ఆ ఆఫీసరు మెల్లిగా ప్రారంభించి, రాన్రాను కోపంతో అరవడం మొదలు పెట్టాడు. అప్పుడా ఆఫీసరు ఏమిటంటు

న్నాడో ఆయనకే తెలీదు. పచ్చిబూతులు తిడుతున్నాడు.

అప్పుడు ఆ ఖైదీల నరాల్లో రక్తం ఆ పోలీసాఫీసరు మాటలకే పొంగిందో, లేక కసితో పొంగిందో చెప్పలేం కానీ వాళ్ళు ఐదుగురూ ఆ సమయంలో పేలడానికి సిద్ధంగావున్న బాంబుల్లా వున్నారు.

అప్పుడు ఆ మాటలు, తిట్లు వినలేని అన్సారీ—

"ఏ తప్పు చేశామని.... మాకు జైలు.. మమ్మల్నెందుకు కోర్టుకి ప్రొసీడ్ చేయకుండా వుంచారు. లాయర్నెందుకు ఏర్పాటు చేయలేదు. నిజానికి మేం కాదు ప్రమాదకరమైన వ్యక్తులం. నువ్వు-నీలాంటి పదవి ముసుగు వేసుకుని పైసాకూ-డా పడుచుకునే మీ పోలీసులే ఈ సమాజానికి ద్రోహులు. మీరే గూండాలు....మీరే...."

ఇంకేదో అనబోయాడు. అప్పుడా ఆఫీసరు కోపంతో వూగిపోయి అన్సారీ దగ్గరకు గబగబా వెళ్ళి అతని జుత్తు పట్టుకొని గోడకేసి కొట్టాడు. ఆ దెబ్బ అన్సారీ తలకి బలంగా తగిలింది.

అప్పుడు ఆ ఖైదీలు ఒక్కసారి ఒకరి వేపు ఒకరు చూసుకున్నారు.

క్షణంలో తమ సంకెళ్ళు వేసిన చేతులెత్తి ఆ ఆఫీసరు తలమీద బలంగా మోదారు. ఆ ఆఫీసరు భయంకరంగా కేక వేశాడు.

"చచ్చాడు వెధవ...." రాజప్ప కసిగా అన్నాడు. కానీ ఆ ఆఫీసరు క్రింద పడిపోయినవాడు గుబుక్కున లేచి ఆ కొట్టుగది లైటు వేశాడు. ఆ లైటు వెలుగులో ఆ ఆఫీసరువేపు చూశారు వాళ్ళు ఐదుగురు.

అప్పుడాఫీసరు నెత్తిమీద నుంచి కారుతున్న రక్తం ముఖమీ్మంచి జారి అతని ఖాకీబట్టల మీద పడుతోంది. అతని జుత్తు రేగిపోయింది. అతని కళ్ళలో కోపం. అతని మనసులో ఉద్రేకం వలన అతని నరాలు పొంగేయి. ఆ సమయంలో ఆ అధికారి మనిషిలా లేడు. మృగంలా కూడా లేడు.

"ఒరేయ్. ఒరేయ్ ఇప్పుడు చూపిస్తాను నా తడాఖా. మిమ్మల్ని నాశనం చెయ్యకపోతే నా పేరు....నా పేరే కాదు....మీకు జీవితాంతం గుర్తుండేలా చేస్తాను....ఎవడాపుతాడో నేను చూస్తాను. ఏ ప్రభుత్వం. ఏ నాయకులు. ఏ పత్రికలు. ఏ మేధావులు అడ్డం వస్తారో నేను చూస్తాను. హెడ్ వార్డ..ర్.." అని గట్టిగా కేకలేశాడు.

అంతవరకూ గది పక్కన నిలబడ్డ హెడ్‌వార్డర్ గదిలోకి వచ్చేడు.

"వెళ్ళి..తీసుకురా." అని ఆజ్ఞాపించేడు. ఒకసారి ఆ ఆఫీసరువేపు చూసి గబగబా వెళ్ళి పదినిమిషాల్లో అక్కడకొచ్చాడు.

అప్పుడు అక్కడి వాతావరణం చూసి ఆ హెడ్ వార్డర్ భయపడ్డాడు. ఈ పది నిమిషాల్లో అక్కడ విలయం చెలరేగింది.

పురుషోత్తం కళ్ళద్దాలు కిందపడి అద్దాలు పగిలిపోయాయి. అతని మోచేతుల్నుండి రక్తం కారుతోంది. రాజప్ప నుదురు తోలు పూడి వేలాడుతోంది. అన్సారీ ముక్కు బద్దలైపోయి నెత్తుటేరు అయిపోయింది. బుచ్చిరాజు చొక్కా చిరిగిపోయి. అతని గుండెలమీద పోలీసుబూటు ముద్రలు.... చిమ్ముతున్న రక్తం మరకలు వున్నాయి.

హెడ్ వార్డర్ ఆఫీసరు వేపు భయంగా చూశాడు.

ఆఫీసరు చేతిలో ఇనపగొలుసుంది. ఆ గొలుసును అతడు మడతబెట్టి పట్టుకు నిలబడ్డాడు. ఆ గొలుసు రాపిడికి అతని కుడిచెయ్యి చీరుకుని రక్తం కారుతోంది.

ఆ ఆఫీసరు హెడ్‌వార్డరువేపు ఒకసారి చూసి అతని చూపుల్ని కిందకు మరల్చేడు. ఆ హెడ్ వార్డర్ చేతిలో సీసాని చూసి అతను వొక్కసారి చాలా ఆనందంగా తల వూపి. ముందుకివచ్చిన తన జుత్తుని వెనక్కి తోసుకుని ఆ సీసాని అందుకున్నాడు.

గబుక్కున మూత తెరిచేడు.

ఆ కొట్టు గదిలో నాలుగు వేపులా పడిపోయిన ఆ ఐదుగురి ఖైదీల కళ్ళల్లోనూ ఆ సమయంలో భయం పాదరసంలా పాకింది. ఐదుగురూ ఒక్కసారి ఆ ఆఫీసరువేపు చూశారు.

భయం.

భయం.

భయం.

భయం ? !

అక్కడ రాక్షసత్వం వెయ్యికోరలు విప్పుకుంది. చీకటి సిగ్గుతో తలవంచుకుంది. పేరు తెలియని విషజంతువులు పైకి లేచాయి. అక్కడి రాతి గోడలు బిక్కచచ్చిపోయాయి. అక్కడ గాలి ఈల నక్కవూళలా వుంది. అక్కడ ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఆగిపోయాయి.

"ఒరేయ్."

"కుక్కే."

"బాస్టర్డ్."

"వెధవా."

"లత్తుకోర్."

ఆ ఖైదీలు లేవబోయారు.

ఒకటి. రెండు. మూడు.

మూడే మూడు క్షణాలు.

అబ్బా.. అమ్మా.. అమ్మా..

అమ్మా.. అమ్మా.. అమ్మా..

అమ్మ.. అమ్మ..

కేకలు. అరుపులు. హాహాకారాలు.

ఏ అమ్మా వాళ్ళ పిలుపుల్ని వినలేదు. వాళ్ళ బాధల్ని చూడలేదు. వాళ్ళ కడుపులోని పేగులు ఉంగలు చుట్టుకు పోయాయి. వాళ్ళ చేతులు నిస్సహాయంగా ముందుకుకదిలేయి. వాళ్ళ కాళ్ళే భయంవల్ల కదలలేకపోయాయి. వాళ్ళ..

కళ్ళు..

కళ్ళు..

ఆ కళ్ళు ఒక్కసారి బొబ్బలెక్కాయి. అంతంత నీటి బుడగల్లాగ ఆ కళ్ళమీద తెల్లటిబొబ్బలు. కళ్ళమీద సున్నితమైనపొర కనురెప్పలు కలిసి ఉడికిపోయాయి. వాళ్ళు కుంపటి మీద కాల్తున్న కోడిపిల్లల్లాగా అరిచేరు. ఆ అరుపులు ఆ జైలు రాతిగోడలు దాటి బైటకొచ్చాయో లేదో తెలీదు. ఆ జైలు అధికారి ఆ సీసా నిండుగా వున్న పవర్‌ఫుల్ ఆసిడ్‌ని నిర్దాక్షిణ్యంగా, అమానుషంగా, భయంకరంగా, అన్యాయంగా, అధికారంగా ఆ ఖైదీల కళ్ళల్లోకి విసురుతూ.... విసురుతూ.... విసురుతూ.... విసురుతూ.... విసురుతూ....

